కథ

# ప్రసవం ఒక ప్రణవం

డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్
+26776279761

“ఆడదంటే అమ్మయేను..
సృష్టికే భువి తాను...
పతి సేవల ఓర్పు తాను..
ఇరుతనువులు ఒక్కటవ్వ నెలతప్పును..
బిడ్డ పెరుగు గర్భంలో.. అండమవ్వును పిండంగా..
తొలిరూపం మలిరూపం.. నవమాసపు అడుగుల్లో
ఎన్నెన్నో వింతలాయే..
చిమ్మ చీకటి కడుపులోనా బిడ్డ తన్నులు గిలిగింతలు..
ఆలి అవ్వును అమ్మగాను!”.. శూన్యంలోకి చూస్తూ, పాట పాడుకుంటూ నడుస్తూ ఉన్నది తులసమ్మ. ఆమె చేతులకు బేడీలు వేసి ఉన్నాయి.

* * *

రాధమ్మ తరపు న్యాయవాది రాజయ్య. కోర్టు బోనులో ఉన్న తులసమ్మ వైపు తిరిగి..

“రాధమ్మ బిడ్డను దురుద్దేశంతో చంపినట్లు నీపైన అభియోగం ఉంది” అన్నాడు.

ఎన్ని ప్రశ్నలు వేసినా..

“చనిపోయిన బిడ్డే పుట్టాడు. నేను ఏ పాపం ఎరుగను!” అనే సమాధానం చెప్పసాగింది తులసమ్మ.

తులసమ్మ తరపున వాదిస్తున్న యాదగిరి.. ముప్పై సంవత్సరాల క్రితం తులసమ్మ పురుడు పోసిన, శాంత కొడుకు. పేరుమోసిన క్రిమినల్ లాయర్. కేసు విచారణలో ఉంది. తులసమ్మను జైలులో పెట్టారు. తులసమ్మకు యావజ్జీవ కారాగార శిక్ష పడవచ్చని అందరూ అనుకుంటున్నారు.

“అమ్మా! నువ్వు లేకుండా ఎట్ల బతికేది?” అని హృదయ విదారకంగా ఏడ్వసాగారు తులసమ్మ కొడుకులు, కూతురు పద్మిని.

“భగవాన్! నిత్య కైంకర్యాలలో నీకు ఏలోటు చేశానయ్యా? నా తులసికి ఎంతటి శిక్ష వేశావు తండ్రీ!” అంటూ ఏడ్వసాగాడు తులసమ్మ భర్త.

* * *

“లోకాలన్నీ ప్రణవం నుంచే ప్రభవించాయంటారు. మనలోని పరమాత్మ ప్రణవనాదమే! బ్రహ్మను కారాగారంలో బంధించి షణ్ముఖుడు సృష్టి చేయడానికి ఉపక్రమించ సంకల్పిస్తాడు. శివుడు షణ్ముఖుణ్ని వారించి.. ‘ఎవరి పనులు వారే చేయాలి. బ్రహ్మను ఎక్కువ కాలం కారాగారంలో ఉంచరాదు. వెంటనే విడుదల చేయండి. సృష్టికి విఘాతం కలిగించవద్దు!’ అని చెబుతాడు”..

జైలు గదిలో మాండూక్యోపనిషత్తు చదువుతూ ఉన్నది తులసమ్మ.

ఇంతలో.. జైలులోని పక్క గదినుంచి స్త్రీ ఏడుపు వినిపించసాగింది.

తులసమ్మకు ఆ ఏడుపును బట్టే అర్థం అయ్యింది.. ‘అది పురిటి నొప్పుల వేదనా భరిత రోదన!’ అని.

హత్యా నేరం కింద జైలులో ఉన్న ఖైదీ నీలమ్మ నాడి చూసి..

“రెండు నిమిషాల్లో కానుపు కాబోతున్నది” అంటూ కవల బిడ్డలకు ప్రసవం చేసింది తులసమ్మ. జైలు అధికారిణి సీత అభ్యర్థన మేరకు!

సమయానికి తులసమ్మ చేసిన కాన్పు గురించి జైలులో అందరూ మాట్లాడుకోసాగారు.

తులసమ్మ ఆలోచనలు మాత్రం గతంలోకి మళ్లాయి.

* * *

మరాఠా సింహాసనాన్ని అధిష్ఠించిన ప్రముఖ రాజుల్లో ఛత్రపతి రాజర్షి షాహూ మహారాజ్ చాలా గొప్పవాడు. ప్రజాస్వామ్యవాది. సంఘ సంస్కర్త. నిమ్న కులాలు, కులేతర సమూహాలకు రిజర్వేషన్ వ్యవస్థను, అందరికీ విద్య వంటి ప్రగతిశీల విధానాలను అమలు చేశాడు. అంబేద్కర్‌తో కలిసి ఎన్నో ప్రజాహిత సంస్కరణలు చేశాడు. రాజర్షి షాహూ ఆస్థానంలో మహదేవ్ దేశాయ్ కోశాధికారి. 19వ శతాబ్దంలో ఈ రాష్ట్రాన్ని బ్రిటీషు వారు స్వాధీనం చేసుకోవడంతో మహదేవ్ దేశాయ్.. రాత్రికి రాత్రే కట్టుబట్టలతో, భార్య తులసీబాయిని, ఆరుగురు కొడుకులు, ఒక్కగానొక్క కూతురు పద్మినిని తీసుకొని కొల్హాపూర్ నుంచి ఆదిలాబాద్ పరిసర గ్రామం, రాధానగరికి చేరుకున్నాడు. భార్య తులసీబాయి ఒంటి మీద నగలు అమ్మి అక్కడే నివాసం ఏర్పరచుకున్నాడు.

* * *

“తులసీ! వేదాలు, వేదాంగాలు, ఎన్నో పౌరాణిక గ్రంథాలను అధ్యయనం చేసిన నాకు ఈ ఊరి దేవాలయంలో అర్చకునిగా కొలువు దొరికింది. పిల్లల చదువుకు ఈ ఉద్యోగం ఎంతో ఆసరా! మనం పిల్లలకు చదువు ఇస్తే.. గుప్తధనం ఇచ్చినట్టే!” అన్నాడు భార్యతో మహదేవ్ దేశాయ్.

